క్లుప్తంగా

అమ్మవారికి మకర తోరణం సమర్పణ


అమ్మవారికి అలంకరించిన మకర తోరణం

రాజమహేంద్రవరం సిటీ: మాతృశ్రీ కన్నమ్మ పేరంటాళ్లు జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి రైల్వే క్రూ కంట్రోలర్ బైరెడ్డి వెంకట బృందావన కృష్ణారెడ్డి, శివజ్యోతి దంపతులు సోమవారం మకర తోరణం సమర్పించారు. ప్రధాన రైల్వే స్టేషన్ ఆవరణలోని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పక్కనే గల కన్నమ్మ పేరంటాళ్లు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మకర తోరణాన్ని అలంకరించారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ సూపరింటెండెంట్ బైరెడ్డి దుర్గా అప్పలరెడ్డి, కన్నమ్మ తల్లి ఆలయ పాలక మండలి సభ్యులు దల్లి రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ప్రకాశం నగర్: పరమ హంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో సోమవారం లాలా చెరువు రోడ్డులోని శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘంలోని ఆశ్రయం పొందుతున్న సుమారు 72 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 9 మందికి ఆపరేషన్లు 9 మందికి కళ్లజోళ్ల అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో ఎన్.చంటిబాబు, ఎస్‌కే కరీనా, కె.సుబ్బారావు, టి.సునీత పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రకాశం నగర్: శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం కంబాలపేట కోదండ రామాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ముష్టి రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

కిశోర బాలికలకు సదస్సు

ప్రకాశం నగర్: బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని లాలాచెరువు, కంటిపూడి సర్వారాయుడు, డీఎంహెచ్, సిమెంట్రీ పేట, కన్నమాంబ ఆల్కాట్ గార్డెన్స్ హైస్కూళ్లలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, వేధింపులు, రక్తహీనత తదితర అంశాలపై కిశోర్ బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో నరసమ్మ, డీసీపీవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోయిన గంటలోనే హ్యాండ్ బ్యాగ్ రికవరీ


ఏఎన్‌ఎంకు బ్యాగ్ అందజేస్తున్న ఏఎస్సై సమర్పణరావు

సీతానగరం: కూనవరం సచివాలయ ఏఎన్ఎం యూకే శారద ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఎస్సై టి.రామకృష్ణ గంటలో రూ.45 వేల విలువైన వస్తువులున్న బ్యాగును రికవరీ చేసి అందించారు. విధులలో భాగంగా శారద సోమవారం సీతానగరం పీహెచ్‌సీకి వచ్చి తిరిగి తన బైక్‌పై కూనవరం వెళుతుండగా ఆమె హ్యాండ్‌బ్యాగ్ పడిపోయింది. దీంతో సీతానగరం పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం 6 గంటలకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఎస్సై సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, సిబ్బంది సాయంతో సాయంత్రం 7 గంటలకు హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ.30 వేల విలువైన గవర్నమెంట్ సామ్సంగ్ ట్యాబ్, రూ.15 వేల విలువైన సెల్‌ఫోన్, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. పోయిన తన వస్తువులను తిరిగి అప్పగించినందులకు ఎస్సై రామకృష్ణతో పాటుగా సిబ్బందికి ఏఎన్ఎం శారద కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం రూరల్: తన భర్త అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడంటూ తాడితోటలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన వడ్డి వెంకటలక్ష్మి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. తాడితోట అంబేడ్కర్ నగర్‌కు చెందిన వడ్డి పరశురాం(43) వద్దకు ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఆవ రోడ్డుకు చెందిన పట్టా సత్యనారాయణ వచ్చాడు. తన ఇంటి దగ్గర కొబ్బరి చెట్టు ఆకులు కొట్టాలని అడిగాడు. రూ.600కు బేరం కుదుర్చుకుని ఆకులు కొట్టడానికి పరశురాం వెళ్లాడు. ఈ నేపథ్యంలో సత్యనారాయణ ఇంటి ముందు ఉన్న కొబ్బరి చెట్టు ఎక్కి ఆకులు కొడుతుండగా పట్టుజారి కిందపడిపోయాడు. అనంతరం గాయాలతో ఉన్న పరశురాంను అతడి ఇంటి వద్ద సత్యనారాయణ అప్పగించాడు. పనిలో తాగి పడిపోయాడని పరశురాం భార్యకు చెప్పాడు. అయితే సోమవారం ఉదయం 5 గంటల సమయంలో పరశురాంకు గురక రావడంతో వెంటనే అతడిని బంధువుల సాయంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించమన్నారు. అక్కడకు తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ ఫలితాలలో టాప్‌గేర్

- ప్రభుత్వ పాఠశాలల దూకుడు
- మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు


బొమ్మూరు జీపీఆర్ స్కూల్లో టాపర్లుగా నిలిచిన తేజస్విని, సింధులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కడియం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టాప్ గేర్‌లో దూసుకుపోయారు. ప్రభుత్వం ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి, చక్కని కార్యాచరణతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించారు. కడియం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో 83.95 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవోలు ఎంఎస్ మణికుమార్, వై.నాగేశ్వరరావు తెలిపారు. పరీక్షలకు 779 మంది హాజరు కాగా 654 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో కడియం హైస్కూల్‌కు చెందిన తాండ్ర హేమ 578 మార్కులతో మండలంలో ప్రథమ, మురమండకు చెందిన తాతవోలు శ్రీసాయిశ్రావ్య 566 మార్కులతో ద్వితీయ, వీరవరానికి చెందిన భీమిరెడ్డి దుర్గ 565 మార్కులతో తృతీయస్థానాల్లో నిలిచారన్నారు.

- కడియం హైస్కూల్ విద్యార్థులు 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. తాండ్ర హేమ 578, జక్కల భానుప్రకాష్ 565, గేదెల విజయలక్ష్మి, ఏ.కీర్తనలు 548 చొప్పున సాధించారు.
- మురమండ స్కూలు 97 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. తాతవోల శ్రీసాయిశ్రావ్య 566, ఏటీ వెంకటేష్ 547, కె.రత్నకుమారి 530 మార్కులు సాధించారు.
- వీరవరం స్కూలు నుంచి 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. భీమిరెడ్డి దుర్గా ప్రశాంతి 565, పదిలం నాగ ధనుశ్రీ 559, గంగుమళ్ల రామకేశవ, పిచ్చుక దివ్య 542 చొప్పున మార్కులు తెచ్చుకున్నారు.
- దుళ్ల ఉన్నత పాఠశాలలో 93 శాతం మంది పాసయ్యారు. బళ్ల దుర్గా పావని 562, కటకం శ్రీచంద్రిక 531, వడ్లమూరి సంధ్య 521 మార్కులు దక్కించుకున్నారన్నారు.
- వేమగిరి హైస్కూలు 67 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఏవీవీ ముత్యాల రాధిక 561, పి. సత్యసాయిదేవి 535, ఎస్.గాయత్రి 524 మార్కులు సాధించారు.
- కడియపులంక నుంచి 93 శాతం మంది ఉత్తీర్ణులవ్వగా వారిలో గేదెల స్వాతికి 551, ఎం. మౌనికా పద్మజకు 547, జి.గౌతమికి 542 మార్కులు వచ్చాయి.
- జేగురుపాడు ఉన్నత పాఠశాల నుంచి 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బాలిన సాయిహర్షిత 543, చందూరి ఎల్ఎస్ మహేష్ 533, ఏడిద వరలక్ష్మి 524 మార్కులు సాధించారు.
- మాధవరాయుడుపాలెం ఉన్నత పాఠశాల నుంచి 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులవ్వగా, వారిలో ఏసిలంక లక్ష్మీవర్ధిని 534, గాదంశెట్టి వర్షియవీర 524, వి.వీర వెంకట గణేష్ 521 మార్కులు పొందారు.
- వేమగిరితోట ఉన్నత పాఠశాల 43 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎం.అనూషకు 449, కె.జాహ్నవికి 443, జీవీఎస్‌జీ కృష్ణకు 421 మార్కులు వచ్చాయి.

రూరల్ మండలంలో 73.3 శాతం ఉత్తీర్ణత

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ మండలంలో పదో తరగతి విద్యార్థులు 73.3 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి -1 ఏఆర్‌కేడీ తులసీదాస్ అన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 1,206 మంది పరీక్షలు రాయగా, 884 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. బొమ్మూరు జీపీఆర్ హైస్కూల్‌కు చెందిన కాసాని తేజశ్విని 591, మట్టపర్తి వెంకట సత్య సాయిసింధు 590 సాధించారన్నారు. పిడింగొయ్యి జెడ్పీహెచ్ఎస్ 96, బొమ్మూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల 91.46, బొమ్మూరు ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల 89.29, శాటిలైట్ సిటీ హైస్కూలు 88, బొమ్మూరు ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ హైస్కూల్ 82.35, ధవళేశ్వరం జెడ్పీహెచ్ఎస్ (బాలికలు) 80.1, కాతేరు జెడ్పీహెచ్ఎస్ 75.47, రాజవోలు ఎస్ఎల్ఎన్ జెడ్పీహెచ్ఎస్ 72.92, కొంతమూరు ఈఏఆర్ హైస్కూల్ 70.83, తొర్రేడు హైస్కూలు 70, బొమ్మూరు జీపీఆర్ హైస్కూలు 67.68, హుకుంపేట హైస్కూలు 63.58, ధవళేశ్వరం లూథరన్ హైస్కూల్ 53.13, కొంతమూరు జెడ్పీహెచ్ఎస్ 44.26, ధవళేశ్వరం జెడ్పీహెచ్ఎస్ (బాలురు) 39.19 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బొమ్మూరు జీపీఆర్ హైస్కూల్‌లో టాపర్లుగా నిలిచిన తేజశ్విని, సింధు, వారి తల్లిదండ్రులను విశ్రాంత హెచ్ఎం ఈశ్వరి, ఇన్‌చార్జి హెచ్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు, స్కూలు పేరెంట్స్‌కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్ అభినందించారు.

మ్యాథ్స్, సైన్స్‌లలో వందకు వంద మార్కులు

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం అర్బన్ సిటీ మున్సిపల్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థి వీఎస్‌బీఏఎస్ నాగ సాయిష్ లెక్కలు, సైన్స్‌లో వందకు వంద మార్కులు సాధించాడు. మొత్తం 589 మార్కులు వచ్చాయి. సాయిష్ తండ్రి శ్రీకృష్ణ పరమాత్మ హోటల్లో చిన్న ఉద్యోగం చేస్తుండగా, తల్లి పద్మావతి గృహిణి. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో తాను ఉత్తమ మార్కులు సాధించినట్టు సాయిష్ తెలిపాడు. ఇంజినీర్ కావడమే తన లక్ష్యమన్నారు.


సాయిష్, 589, సిటీ మున్సిపల్ హైస్కూల్


తాండ్ర హేమ, 578 మార్కులు


తాతవోలు శ్రీసాయి శ్రావ్య, 566 మార్కులు


జక్కల భానుప్రకాష్, 565 మార్కులు

జగనన్న సాయంతోనే చదువు

కడియం: సీఎం జగన్ అందిస్తున్న ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషితోనే తమ అమ్మాయి హేమ పదో తరగతిలో మంచి మార్కులు సాధించిందని మాధవరాయుడుపాలెం పరిధిలోని చైతన్య నగర్ కాలనీకి చెందిన తాండ్ర భూలక్ష్మి అన్నారు. ఆమె పెద్ద కుమార్తె హేమ పదో తరగతిలో 578 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానం సాధించింది. హేమ తండ్రి గౌరీనాయుడు పేపరు మిల్లులో కాంట్రాక్టు లేబర్‌గా, తల్లి భూలక్ష్మి వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె హేమ కడియం ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంది. కూలి పనిచేసుకునే ఆ దంపతులు తమ పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో చదివిస్తున్నారు. సీఎం జగన్ అందిస్తున్న పథకాలు, పాఠశాలలో కల్పించిన వసతులు తదితర వాటితో ఆ పిల్లల చదువు చక్కగా సాగిపోతోంది. కాగా.. హేమలోని చదువుకోవాలన్న పట్టుదలను చూసి కడియం హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ రూ.ఆరువేలతో సైకిల్‌ను కొనిచ్చారు. అందరి నమ్మకాన్ని నిలబెడుతూ హేమ మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కూడా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించింది. ఆ విద్యార్థిని హెచ్ఎం టి.సత్యనారాయణ, ఎస్ఎంసీ అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.


కడియం మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన హేమకు స్వీట్ తినిపిస్తున్న తల్లి భూలక్ష్మి

అడుగడుగునా నీరాజనం

- నగరంలో నామినేషన్ల సందడి
- పత్రాలను అందజేసిన ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- అభిమానులతో భారీ ర్యాలీ


భారీ ర్యాలీతో నామినేషన్ వేసేందుకు వెళుతున్న వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్


రిటర్నింగ్ అధికారి, కమిషనర్ దినేష్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ భరత్‌రామ్


కలెక్టర్ మాధవీలతకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో సోమవారం నామినేషన్ల సందడి నెలకొంది. వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపీ భరత్ రామ్ నామినేషన్ ప్రతాలను నగర పాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, కమిషనర్ దినేష్ కుమార్‌కు అందజేశారు. ఎంపీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఊరేగింపుగా తరలిరాగా ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు ఆర్వో కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఎంతో అభిమానంతో తనను గెలిపించారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారన్నారు. ఎంపీగా ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఒక ట్రైలర్ మాత్రమేనని, ఎమ్మెల్యేగా గెలిచాక మరింత అభివృద్ధి చేసి నగర రూపురేఖలు సమూలంగా మార్చేస్తానన్నారు. సిటీ ఎమ్మెల్యేగా వచ్చే ఐదు సంవత్సరాలలో ఏమి చేస్తానో తెలియజేస్తూ మేనిఫెస్టో రూపొందించానని, ఒకటి, రెండు రోజులలో దానిని విడుదల చేస్తానన్నారు. ప్రధానంగా నగర వాసులకు 24 గంటలూ మంచినీటి సరఫరా అందించడం, ఇంటర్నల్ రహదారులను అభివృద్ధి చేయడం, పలుచోట్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, గోదావరి బండ్‌ను హైదరాబాదు టాంక్ బండ్‌కి మించి అభివృద్ధి చేయడం, క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం నిర్మాణాలు, నగరంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రెండు మూడు పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని చెప్పారు. ముందుగా ర్యాలీ మార్గాని ఎస్టేట్స్ నుంచి వీఎల్ పురం జంక్షన్, తిలక్ రోడ్డు, రామాలయం సెంటర్, మానస హాస్పిటల్ జంక్షన్, దానవాయిపేట, నందం గనిరాజు సెంటర్, కంబాల చెరువు వరకూ నిర్వహించారు. అక్కడ నుంచి పాదయాత్రగా దేవీచౌక్, గోకవరం బస్టాండ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో భరత్‌రామ్ తల్లిదండ్రులు ప్రసూన, మార్గాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న గూడూరి

సీటీఆర్ఐ: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సోమవారం నామినేషన్ వేశారు. ముందుగా తిలక్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరారు. ముందుగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి వీఎల్ పురం జంక్షన్ నుంచి సోమాలమ్మ గుడి వీధికి చేరుకుని అక్కడ దర్శనం అనంతరం రామాలయం జంక్షన్, జేఎన్ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్‌కు చేరుకుని అక్కడ నుంచి నేరుగా బొమ్మూరు మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ కలెక్టర్‌కు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు, ఎంపీ మార్గాని భరత్ రామ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీను, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎన్నికల పరిశీలకులు రావిపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

మంత్రి వేణు నామినేషన్ రేపు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బుధవారం ఉదయం 11.08 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని జేసీ చాంబర్‌లో నామినేషన్ వేయనున్నారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయం నుంచి ఆ రోజు ఉదయం 9 గంటలకు ర్యాలీగా బయలుదేరతారు.

సిటీలో నాలుగు, రూరల్‌లో ఐదు నామినేషన్లు

రాజమహేంద్రవరం సిటీ: సిటీ అసెంబ్లీ నియోజక వర్గంలో సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థులుగా నలుగురు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ తరఫున మార్గాని భరత్ రామ్ ఒక సెట్, మార్గాని నాగేశ్వరరావు ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున బోడా లక్ష్మీవెంకట ప్రసన్న ఒక సెట్, టీడీపీ ఆదిరెడ్డి శ్రీనివాస్ తరఫున వీర రాఘవమ్మ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ నియోజకవర్గంలో సోమవారం ఐదు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. జై భారత్ పార్టీ తరఫున మన్నం రఘురామ్, స్వతంత్ర అభ్యర్థిగా చింతలపల్లి పవన్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున బాలేపల్లి మురళీధర్, తెలుగుదేశం పార్టీ తరఫున గోరంట్ల ఝాన్సీలక్ష్మి, గోరంట్ల బుచ్చియ్య చౌదరి నామినేషన్ దాఖలు చేశారన్నారు. ఇప్పటి వరకు ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు.

ఎన్నికల ప్రచారం

ధవళేశ్వరం: టీడీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి సోమవారం ధవళేశ్వరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సామాజిక న్యాయం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- వైఎస్సార్ సీపీలో 500 మంది చేరిక


మంత్రి వేణుగోపాలకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మత్స్యకారులు

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరంలో గంగపుత్ర మత్స్యకార సంఘానికి చెందిన సుమారు 500 మంది మహిళలు, మత్స్యకారులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి వేణుగోపాలకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గంగపుత్ర మత్స్యకార వర్తక సంఘం అధ్యక్షుడు వాడమొదలు అప్పారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు అన్నవరం, మైలపల్లి అమ్మాజీ, గొండు లక్ష్మి, బొడ్డు సుబ్బారావు, ప్రసాద్, గొల్ల సత్యవతి, సతీష్, కరుకు హరిప్రసాద్, ఎరుపిల్లి శ్రీను, మామిడి హరి, నాగమళ్ల రాజీ, కంచుమర్తి ధనలక్ష్మి, నాగమళ్ల ఎర్రబాబు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

మత్స్యకారులకు ప్రాధాన్యం

మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడతూ మత్స్యకారులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేశారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేశారన్నారు. మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి చెందాలంటే తనను ఎమ్మెల్యేగా గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, డాక్టర్ అనసూరి పద్మలత, కరుకు ఇమ్మాన్యుయేలు, పండు, ఎన్వీ శేఖర్, తలారి వరప్రసాద్, దేవులపల్లి సరితారాణి, మేడి త్రిమూర్తులు, వెర్రియ్య, పెన్నాడ జయప్రసాద్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, దేవదాసి రమేష్, ముత్యాల పోసికుమార్, చింతపర్తి రాంబాబు, ఇబ్రహీం బాషా,హమీద్ బాషా,షట్టర్ బాషా పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ఎండ నుంచి రక్షణకు చర్యలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఖైదీలకు ఎండల నుంచి ఉపశమనం కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ నేతృత్వంలో ఖైదీలకు వేసవి రక్షణ కోసం ఇటీవల కొన్ని సదుపాయాలు కల్పించారు. ఎడిషనల్ సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు రాజకుమార్, రత్నంరాజు ఆధ్వర్యంలో బ్యారక్‌లలోకి వేడి రాకుండా రూఫ్ సీలింగ్‌లకు కూల్ పెయింట్ వేయించారు. అన్ని గదుల్లోను పాడైన ఫ్యాన్లకు మరమ్మతులు చేయించారు. అవసరమైనచోట కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ప్రతి బ్యారక్ దగ్గర మట్టికుండలతో చల్లటి నీరు ఏర్పాటు చేశారు. కిటికీల నుంచి వేడి గాలులు గదుల్లోకి రాకుండా సన్నని వెదురుతో తయారు చేసిన ప్రత్యేక తడికెలను చాపలుగా అమర్చారు. జైలు ఆవరణ చల్లగా, నీడగా ఉండేందుకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఇప్పటికే విస్తారంగా మొక్కలు పెంచారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఖైదీలకు వడదెబ్బ తగలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కారాగారంలో స్టీల్ ప్లాంట్, మగ్గం, టైలరింగ్, నర్సరీ తదితర విభాగాల్లో పని చేసే ఖైదీలకు మధ్యాహ్న సమయాన్ని కుదించి సాయంకాలానికి మార్పు చేశారు. జైలు ముఖద్వారం వద్ద బయట బాటసారులు కోసం పెద్దపెద్ద కుండలతో ఓపెన్ ఖైదీలతో చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. జైలు ఆవరణలో చెట్లపై సేదతీరే పక్షులకు కూడా నీరు, ఆహారాన్ని ఏర్పాటు చేశారు.


సెంట్రల్ జైలు బ్యారక్‌లకు కూల్ పెయింట్ వేస్తున్న దృశ్యం

మహిళ ఆత్మహత్య

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని క్వారీ సెంటర్ సిద్ధార్థ నగర్‌కు చెందిన బొజ్జి మహాలక్ష్మి(63) బాత్‌రూమ్‌లో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్న 2.30 గంటల సమయంలో మృతిచెందింది. ఆమె కుమారుడు బొజ్జి రాజశేఖర్ తన తల్లికి మతిస్థిమితం సరిగాలేదని, గత కొన్నిరోజులుగా చనిపోతానంటూ చెప్పేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. త్రీటౌన్ ఎస్సై శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న వస్తేనే సంక్షేమ పథకాలు

సీతానగరం: ఐదేళ్లగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే ప్రస్తుత ఎన్నికల్లో ఆయను మరోసారి గెలిపిస్తాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. సోమవారం వంగలపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.1,773 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు, మరో రూ.1,377 కోట్లతో సంక్షేమం అందించామన్నారు.

వ్యవసాయ సంఘ నాయకులకు సత్కారం


ఉద్యోగ సంఘ నాయకులను అభినందిస్తున్న డీఏవో మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘ నాయకులుగా ఎన్నికైన ఉద్యోగులను సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఏవో మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తెరగాలన్నారు. సంఘం సహ అధ్యక్షులుగా ఎన్నికైన కె.వృంద, ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.జయదివ్య, సంయుక్త కార్యదర్శి సందీప్, రాజమండ్రి ఏపీ ఎన్జీవో సంఘ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన వెంకట్రావును సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏఈఓ సంఘ అధ్యక్షుడు డి.వేణు మాధవరావు, ఏపీ ఎన్జీవో సంఘ నగర శాఖ ఉపాధ్యక్షుడు ఎం.మాధవరావు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

రాజమహేంద్రవరం రూరల్: రానున్న ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. స్థానిక ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు పనులను సోమవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫెసిలిటేషన్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబా, సహాయ రిటర్నింగ్ అధికారులు వైవీకే అప్పారావు, బి.రమాదేవి ఉన్నారు.